

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. -8లో



క్షుద్ర పూజల కలకలం

గుర్రంకొండలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. స్థానిక ఇందిరమ్మకాలనీ శ్మశానంలో ఈ విషయం వెలుగుచూడడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	515	515
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 77.260 కిలోలు



న్యూస్‌రీల్

వైవీయూ దూర విద్య పీజీ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: వైవీయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ పీజీ మొదటి,రెండవ సెమిస్టర్ల ఫలితాలను సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ బాబుతో కలసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1, 2వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఫస్ట్ సెమిస్టర్ ఆర్థికశాస్త్రం, ఇంగ్లీష్ , చరిత్ర, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, రాజకీయ శాస్త్రం, మనస్తత్వశాస్త్రం వాణిజ్య శాస్త్రం కోర్సులలో వంద శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ప్రత్యేక తెలుగులో 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకోండి



స్వచ్ఛంద సంస్థల యజమానులు, ఎన్‌జీవోల నిర్వహకులకు సూచనలిస్తున్న డీటీఓ ప్రసాద్

రాయచోటి టౌన్: జిల్లాలో డ్రైవర్ శిక్షణ కేంద్రాలను నిర్వహించడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా డీటీఓ ప్రసాద్ సూచించారు. బుధవారం రాయచోటి డీటీఓ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్‌లు, విద్యాసంస్థలకు చెందిన వారు, ఎన్‌ఈవోలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డ్రైవర్ శిక్షణ , పరిశోధన సంస్థ (ఐడీటీఆర్‌ర్), జిల్లా శిక్షణ కేంద్రాలు, (డీటీసీలు) ఏర్పాటు కోసం ఎంఓఆర్‌టీహెచ్‌చ్ జారీ చేసినట్లు తెలిపారు. అందుకు కావాల్సిన మార్గదర్శకాలను వివరించారు. అర్హత కలిగిన వారు జిల్లా మెజిస్ట్రేట్ మరియు జిల్లా కలెక్టర్ ద్వారా రూపొందించిన ప్రొఫార్మా ద్వారా ప్రతిపాదనలు పంపాలని చెప్పారు.

డైట్ అధ్యాపక పోస్టులకు...

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి విద్యాశిక్షణ సంస్థలో అధ్యాపకులు, సీనియర్ లెక్చరర్‌లుగా డిప్యూటేషన్ పనిచేయుటకు ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చి 31 నాటికి దరఖాస్తుదారులకు 58 సంవత్సరాలకు మించకూడదని, కనీసం 5 సంవత్సరాల స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎం, ఎంఈఓలుగా పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేట్‌లో 55 శాతం మార్కులు, ఎంఈడీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. కనీసస్థాయి కంప్యూటర్‌పై అవగాహనను కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు ఏప్రిల్ 16,17తేదీలలో రాత పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన వారికి 19వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సందేహాల నివృత్తి కోసం ఐలయ్య 8790541535, ప్రతాప్ 8328631973 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



ఒంటిమిట్ట బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మీ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మీ తెలిపారు. బుధవారం ఒంటిమిట్ట బస్టాండ్‌లో పారిశుద్ధ్యాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలోని దుకాణాల వద్ద పేరుకుపోయిన చెత్తను దుకాణాదారులతో శుభ్రం చేయించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎక్కడేగాని పారిశుద్ధ్య లోపం అనేది కనిపించకూడదని పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో పంచాయతీశాఖ తరపున ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయభాస్కర్, డీఓపిఆర్‌డీ కెఆర్‌ఎం ప్రసాద్, ఏఓ చాంద్ బాష, ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేరుకే జంక్షన్.. ప్రయాణికులకు టెన్షన్





చదువు కోసం.. వ్యాపార నిమిత్తం.. పర్యాటక ప్రదేశాలు.. ఇలా ఎన్నో సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే ముందు గుర్తొచ్చేది రైలు ప్రయాణమే. దశాబ్దాల క్రితం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఓబుల వారిపల్లె జంక్షన్‌లో నిలిపేవారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో ఆ జంక్షన్‌కు వచ్చే ప్రయాణికులకు టెన్షన్ తప్పడం లేదు. స్టాపింగ్ కొనసాగించాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఇప్పటికే పలు మార్లు రైల్వేశాఖామంత్రికి, ఆశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించారు.

- ఓబులవారిపల్లె రైల్వే జంక్షన్‌పై కేంద్ర ప్రభుత్వం సీత కన్ను
- దశాబ్దాలుగా ఉన్న స్టాపింగ్ ఎత్తివేత
- కూటమి నాయకుల అసమర్థత
- కేంద్ర మంత్రికి ఎంపీ మిథున్‌రెడ్డి పలుమార్లు వినతి



స్టాపింగ్ ఎత్తివేయడంలో నిలపకుండా వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్

ఓబులవారిపల్లె: కృష్ణపట్నం ఓడరేవుకు రైలు మార్గం నిర్మించడంతో ఓబులవారిపల్లె జంక్షన్‌గా మారింది. రాజంపేట పార్లమెంట్ నియోజవర్గం దక్షిణ భారత దేశ అతిపెద్ద సొరంగ మార్గం గుండా నెల్లూరు కృష్ణపట్నం పోర్టుకు రైలు మార్గం ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతం రైల్వే పరంగా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఎంతగానో ఆశపడి ఎదురు చూశారు. అయితే ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అప్పటి వరకు ఓబులవారిపల్లె జంక్షన్‌లో నిలబడుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌ను రైల్వేశాఖ ఎత్తి వేసింది.

దశాబ్దాల క్రితం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడేవి

దశాబ్దాల కాలం క్రితం నుంచి ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో అప్పటిలో స్టీమ్ ఇంజిన్ ప్యాసింజర్, షటిల్ రైళ్లతో పాటు జనతాఎక్స్‌ప్రెస్ ,రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడేవి. దశాబ్దాల పాటు ఈ రైళ్లు నడిచాయి. ఎప్పుడూ స్టాపింగ్ తొలగించలేదు. అయితే కాలక్రమేణ జనతా ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. దీంతో అప్పట్లో స్థానిక రాజకీయ నాయకులు ముంబాయి, చెన్నై ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కల్పించాలని అప్పటి నుండి రైల్వేవర్గాలను కోరుతూనే ఉన్నారు. అనంతరం కొల్హాపూర్ -తిరుపతి హరిప్రియా ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-తిరుపతి వేంకటాద్రి రైళ్లు నిలబడే వి.

ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులకు అవస్థలు

ప్రతి నెలా దాదాపు కోటి రూపాయలకు పైనే ఓబులవారిపల్లె రైల్వే టికెట్‌ల ద్వారా ఆదాయం లభిస్తోంది. అయినా ఇక్కడ రైళ్లను రద్దు చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



కోవిడ్ అనంతరం రైళ్లు తొలగింపు

స్థానికంగా ఆపుతున్న రైళ్లను కోవిడ్ కారణంగా పూర్తిగా ఇక్కడ రద్దు చేశారు. కోవిడ్ అనంతరం వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ల స్టాపింగ్ తొలగించారు. హరిప్రియ మాత్రమే నిలిపేవారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రిని కోరి వినతి పత్రం అందజేయగా రాయలసీమకు గత ఏడాది మార్చి నెలలో స్టాపింగ్ కల్పించారు. అప్పటి నుంచి ఓబులవారిపల్లె జంక్షన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నిలబడేవి. అయితే ప్రస్తుతం ఆ రెండు రైళ్లు స్టాపింగ్ కూడా రైల్వే అధికారులు రద్దు చేశారు. దీంతో ఆ జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఒకట్టి కూడా నిలబడటం లేదు. ఇటీవలే ఈ విషయంపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఢిల్లీ పర్యటలో కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని అందించారు.

రైల్వే శాఖ నిర్లక్ష్యం



ఓబులవారిపల్లె నుంచి నెల్లూరు కృష్ణపట్నం రైలు మార్గం ఏర్పాటు చేసి దాదాపు ఐదు సంవత్సరలు అయింది. ఓబులవారిపల్లెను జంక్షన్‌గా కూడా మార్చారు. అయితే బోర్డులో ఇప్పటికి కూడా ఓబులవారిపల్లె అని మాత్రమే ఉంది. ఇన్ని రోజులైనా కనీసం రైల్వే శాఖ వారు బోర్డులో పేరుకూడా మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్రతి నిత్యం హైదారాబాదు, చెన్నై, హుబ్లీ తదితర ప్రాంతాలకు మండల కేంద్రం నుంచి వ్యాపారులు వెళ్లేవారు. ప్రజలు పట్టణ ప్రాంతలలోని ఆసుపత్రులకు అనుకూలంగా ఉండేది. రాష్ట్ర రాజధాని విజయవాడకు, ఇతర పట్టణాలకు ప్రస్తుతం నేరుగా వెళ్లాలంటే రేణిగుంట, రాజంపేటకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దూర ప్రాంతాలకు ఎలా వెళ్లాలి : రాష్ట్ర రాజధాని విజయవాడ, విశాఖపట్టణానికి, తెలంగాణ రాజధాని హైదారాబాద్‌కు నేరుగా వెళ్లాలంటే ఓబులవారిపల్లె జంక్షన్ నుంచి రైళ్లు లేవు. రైల్వే శాఖ అధికారులు ఉన్నతాధికారులు స్పందించి రద్దు చేసిన రైళ్లతో పాటు తిరుమల, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కూటమి నాయకుల అసమర్థత

నియోజవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ టీడీపీ నాయకుడు, జనసేన పార్టీ ఎమ్మెల్యే, బీజేపీ కేంద్ర నాయకులు ఉన్నారు. నెల రోజుల నుంచి ఓబులవారిపల్లె జంక్షన్‌లో ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఆగడం లేదని తెలిసినా కూడా స్పందిచక పోవడం కూటమి నాయకుల అసమర్థతను బహిర్గతం చేస్తోంది. ఢిల్లీలో ప్రధాన మంత్రి మోదీ వద్ద చక్రం తిప్పే రాష్ట్ర నాయకుల ప్రధాన అనుచరులు కూడా నియోజవర్గవంలో ఉన్నారు. వారికి చిత్త శుద్ధి ఉంటే గతంలో రద్దు చేసిన వేంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కానీ ప్రస్తుతం రద్దు అయిన హరిప్రియ, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపిగ్ కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుతుండేవారు. ఇప్పుడు ఒక్క ఎక్స్‌ప్రెస్ కూడా నిలపటం లేదు. మా పిల్లలు బిటెక్ చదువుతున్నారు. దూర ప్రాంతాల నుంచి రావాలన్నా.. వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. కొద్ది రోజులు స్టాపింగ్ కల్పిస్తారు మళ్లీ తొలగిస్తారు. ఇప్పటికైనా రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వెంటనే స్టాపింగ్ కల్పించాలి.

– ఓడి సురేంద్రా రెడ్డి, రైతు, ఓబులవారిపల్లె

రైల్వేశాఖ అలసత్వం



పేరుకే జంక్షన్. రైల్వే శాఖ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించారు. ఉద్యోగ, వ్యాపార, స్థానిక ప్రజలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించడంతో ఇబ్బంది పడుతున్నారు. రాజకీయ నాయకులు, రైల్వే శాఖ అధికారులు స్పందించి ప్రస్తుతం స్టాపింగ్ ఎత్తివేసిన హరిప్రియా, రాయలసీమలతో పాటు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి.

–రాజు నాయక్, ఉపాధ్యాయుడు, ఓబులవారిపల్లె

అధికారుల పనితీరే ప్రభుత్వానికి ప్రామాణికం

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రాజంపేట: రెవెన్యూ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టరు, జేసీ, సబ్‌కలెక్టర్

రాయచోటి: రెవెన్యూ అధికారుల పనితీరే ప్రభుత్వ పనితీరుకు ప్రామాణికమని, రెవెన్యూ, సర్వే శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రైవేటు పంక్షన్ హాల్‌లో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, మండల సర్వేయర్లు, ఆర్‌ఎస్టీటీలు, వీఆర్‌ఏలతో రెవెన్యూ అంశాలపై డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులు, రీ సర్వే ప్రగతి, మంజూరైన పొసెషన్ సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ పురోగతి, హౌస్ సైట్స్ రీవెరిఫికేషన్ పురోగతి, పెండింగ్‌లో ఉన్న భూమి అన్యాక్రాంతం, భూసేకరణ, కోర్టు కేసులు, నివాస యూనిట్ల ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిపై ఆక్రమణల క్రమబద్ధీకరణ, అసైన్మెంట్ భూములు కేటాయింపు తదితర రెవెన్యూ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గుర్రంకొండ తహసీల్దార్ అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది పనితీరు రాష్ట్ర పనితీరుగా ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఎట్టి పరిస్థితులలో అన్యాక్రాంతం కాకూడదని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది చేపడుతున్న వివిధ కార్యక్రమాలలో రకరకాలుగా అనుమానాలు వస్తాయని, వాటన్నింటినీ ఈ సదస్సు ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మార్చి 25, 26వ తేదీలలో నిర్వహించే మూడవ కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య జిల్లాకు ఏడవ ర్యాంకు వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం వలనే ఈ ర్యాంకు జిల్లా సాధించగల్గిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేశాఖ ఏడీ భరత్ కుమార్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

రాజంపేట: రెవెన్యూ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. అన్నమాచార్య యూనవర్సిటీ ఆడిటోరియంలో డివిజన్ స్థాయి రెవిన్యూ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు బాధ్యతయుతంగా , జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. రెవెన్యూ అంశాలపై పవర్ పాయంట్ ప్రెజంటేషన్ ద్వారా అవగాహన కలిప్ంచారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలలో తీసుకోవాల్సిన చర్యలపై సర్వేయర్లు , ఆర్‌ఎస్టీటీలు, వీఆర్‌వో, వీఆర్‌ఏలు వెల్లబుచ్చిన సందేహాలకు అనుమాన నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో రాజంపేట డివిజన్‌లో 7229 ఫిర్యాదులు అందగా ఇప్పటి వరకు 6982 సమస్యలు పరిష్కరించారన్నారు. కేవలం 247 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బాధ్యతయుతంగా పూర్తి చేయాలన్నారు. రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమానైదియాదేవి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. వర్క్‌షాప్‌లో సర్వేశాఖ ఏడీ భరత్‌కుమార్, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు వైవీయూలో ఉద్యోగ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి తెలిపారు. ఉద్యోగాల ఎంపికలకు ప్రముఖ మల్టీ నేషనల్ బయో ఫార్మాస్యూటికల్ కంపెనీ 'బయోకాన్' ప్రతినిధులు విద్యాలయానికి రానున్నారని తెలిపారు. ఆ కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా - కెమికల్, బీటెక్ – కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాల కోసం మెకానికల్, ఈఈఈ, ఈసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ, బీటెక్, డిప్లొమా అర్హతలు ఉన్నవారు అర్హులన్నారు. 2023, 2024, 2025 బ్యాచ్‌లలో చదివిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు మాత్రమే డ్రైవ్ లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

ఒంటిమిట్టలో బస్టాండ్ ఏర్పాటు కలేనా..?

- స్టేట్ టెంపుల్‌గా గుర్తించి 11 సంవత్సరాలు
- ఇప్పటికీ బస్టాండ్‌కు నోచుకోని వైనం
- నడిరోడ్డుపైనే ఆపుతున్న బస్సులు
- తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు
- బస్సుల కోసం ఎండలో ప్రయాణికుల అవస్థలు



బస్టాండ్ లేకపోవడంతో ఇరుకు రోడ్డులో ఆర్టీసీ బస్సు వెనుక నిలిచిన వాహనాలు

ఒంటిమిట్ట: రెండవ అయోధ్యగా పేరుగాంచి, రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతూ, ఏకశిలపై సీతా రామ లక్ష్మణ మూర్తులు వెలసిన ఒంటిమిట్టలో ఇంతవరకు రామయ్య భక్తులకు ఆర్టీసీ బస్టాండ్ లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా పేరుకే ఆంధ్రా భద్రాద్రి కానీ ప్రజలకు, భక్తులకు, పర్యాటకులకు ఇంతవరకు ఆర్టీసీ బస్టాండ్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించలేదు. ఒంటిమిట్ట క్షేత్రాన్ని స్టేట్ టెంపుల్‌గా గుర్తించి 11 సంవత్సరాలు గడుస్తున్న భద్రాచలంలో మాదిరి ఇక్కడ ఒక ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని ఆలోచన కూడా ప్రభుత్వానికి రాక పోవడంపై అసలు రాష్ట్ర ప్రభుత్వానికి ఒంటిమిట్ట అభివృద్ధిపై ఆలోచన ఉందా లేదా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు

రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తించబడిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం వెలసిన ఏకశిలా నగరిలో కనీసం ఆర్టీసీ ప్రయాణికులకు బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ లేక ఇక్కడికి వచ్చే బస్సులు నడిరోడ్డుపైనే నిలుపదల చేస్తుండటంతో ప్రక్కకు వెళ్లే మార్గం లేక ప్రయాణీకులు ఎక్కేంతవరకు బస్సు కదలక పోవడంతో వెనుకాల వచ్చే వాహనాలు కిలోమీటర్ల మేర నిలబడిపోతున్నాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. రోజుకు పదిసార్లు ఇలా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పైగా ప్రస్తుతం వేసవికాలం కావడంతో బస్సులుకోసం వేచి చూసే ప్రయాణీకులకు ఎండ తీవ్రత వల్ల తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు.

కల్యాణోత్సవానికి 135 ఆర్టీసీ బస్సులు :

ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈనెల 11వ తేదీ నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి కడప డిపో నుంచి 95, రాజంపేట డిపో నుంచి 40 ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సర్వీసులు నడపనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

టీటీడీ బస్టాప్ నిర్మించినా ఉపయోగం శూన్యం

2017లో బ్రహ్మోత్సవాలకు ముందు రామయ్య భక్తులను దృష్టిలో ఉంచకొని తిరుమల-తిరుపతి దేవస్థానం వారు రూ. 10 లక్షల వ్యయంతో కోదండరామస్వామి దేవాలయం వెనుకవైపు బస్టాప్ సౌకర్యాన్ని భక్తులకు కల్పించారు. కానీ రామయ్య భక్తులకు ఆ సౌకర్యం ఎన్నో రోజులు నిలవలేదు. 2017లో టీటీడీ బస్ సెల్టర్ ఏర్పాటు చేసినా ఆర్టీసీ బస్సులు అక్కడ నిలుపుదల చేయకపోవడంతో ఆ బస్సుసెల్టర్ కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండిపోయింది. అలా దేనికి ఉపయోగపడని బస్సు సెల్టర్‌ను కడప జిల్లా పోలీస్ యంత్రాంగం వారుటీటీడీ అధికారుల అనుమతి లేకుండా స్వాధీనం చేసుకొని అందులో టూరిస్టు పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.



టీటీడీ నిర్మించిన బస్ సెల్టర్ స్వాధీనం చేసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగం

ప్రతిపాదనలు వస్తే తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



ఒంటిమిట్టలో భద్రాచలం లాంటి ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని ఎలాంటి ప్రొపోజల్స్ రాలేదు. అలాంటివి ఏమైనా వస్తే తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే తదుపరి బస్టాండ్ ఏర్పాటుకు ఉండవలసిన అర్హతలను బట్టి ఇక్కడ అన్ని రకాల బస్సులు నిలుపుదలకు బస్టాండ్ ఏర్పాటు చేస్తాం. అంతవరకు బస్ సెల్టర్ ఏర్పాటు చేయమని ఇదివరకే టీటీడీ దృష్టికి తీసుకెళ్లాం.

– గోపాల్ రెడ్డి, ఆర్‌ఎం, ఆర్టీసీ, కడప జిల్లా

క్లుప్తంగా

ప్రభుత్వ భూమి స్వాధీనం



బండపల్లె వద్ద ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కురబలకోట : మండలంలోని బండపల్లె వద్ద 70 సెంట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక తహసీల్దారు తపస్విని, ఎంఆర్ఐ బాలసుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ఇది ప్రభుత్వ భూమి అని అన్యాక్రాంతంలో ఉండడంతో స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా భూ దురాక్రమణదారులు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే ఏమాత్రం ఆలస్యం లేకుండా వెంటనే స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వృద్ధుడిపై కర్రలతో దాడి



ఆసుపత్రిలో తీవ్ర రక్త గాయాలతో రామక్రిష్టారెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన ఎరమద్దు రామక్రిష్టారెడ్డి (74) అనే వృద్ధుడిపై ఇదే పంచాయతీలోని డి.నారాయణపల్లికి చెందిన ప్రతాప్‌రెడ్డి, శబరీష్‌లు కర్రలు, రాళ్లతో దాడి చేసినట్లు బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లిలో రామక్రిష్టారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం చేపడుతుండగా ఆ ఇంటిలో తమకు కూడా హక్కు ఉందనే కారణంతో మంగళవారం నారాయణపల్లికి చెందిన సుశీలమ్మ, శబరీష్‌లు అడ్డుకుని దౌర్జన్యం చేశారు. రామక్రిష్టారెడ్డి భార్య లక్ష్మిదేవమ్మ, కుమారుడు సోమశేఖర్‌రెడ్డి, కోడలు అలివేలమ్మలను గాయపరిచారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తమపై మరింత కక్ష పెంచుకుని తన మామ రామక్రిష్టారెడ్డిని తీవ్రంగా గాయపరచడంతో మదనపల్లె ఆసుపత్రికి తరలించామని కోడలు అలివేలమ్మ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ హరిహర ప్రసాద్ మాట్లాడుతూ దాడికి గల కారణాలు, జరిగిన ఘటనపై క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తామన్నారు.

మహిళ మెడలోని తాళిబొట్టు సరుడు చోరీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని అమ్మవారిపల్లి గ్రామ శివారులో పాలమ్మ (50) అనే మహిళ మెడలోని బంగారు తాళిబొట్టు సరుదును దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసుల వివరాల మేరకు అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన పాలమ్మ గేదెలను తోలుకొని గ్రామ శివారులోని అడవుల్లోకి వెళ్లింది. తిరిగి వస్తుండగా గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి స్కూటీలో వచ్చి ఆమె మెడలోని బంగారు తాళిబొట్టు సరుడును లాగే ప్రయత్నం చేశాడు. ఆమె అడ్డుకోబోగా దుండగుడు ఆమెను చేతులతో కొట్టి, కత్తి చూపించి భయపెట్టి తాళిబొట్టు సరుడును లాక్కొని పరారయ్యాడు. తాళిబొట్టు సరుడు మూడు తులాలు ఉండగా దాని విలువ సుమారు రూ.1,80,000లు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

- వక్ఫ్ బిల్లుపై పునరాలోచించాలి
- శాంతి భద్రతలపై కఠినంగా వ్యవహరించాలి
- మీడియా సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలన వైఫల్యాలను శ్రీకాంత్ రెడ్డి ఎండగట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో కరువు ఛాయలు పెద్దగా కనిపించలేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో మొదటి ఏడాదిలోనే దారుణమైన కరువు పరిస్థితులు దాపురించాయన్నారు. కరువు కారణంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అరకొర నీటితో సాగు చేసి పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. టమాటా, ఇతర పండ్ల తోటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బోర్లు ఎండుతున్నాయన్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతలలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. దశాబ్దాల తరబడి దిగుబడి అందించాల్సిన మామిడి తోటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయన్నారు. వేల రూపాయలు పెట్టి ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీరు నింపుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు.

కరువు పరిస్థితులు కనిపించలేదా?

రాష్ట్ర ప్రభుత్వం 51 కరువు మండలాలను ప్రకటించిందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాయచోటి నియోజకవర్గంలో ఆరు మండలాల్లోనూ ఉన్న తీవ్ర కరువు పరిస్థితులు ప్రభుత్వానికి కనపడలేదా అని ప్రశ్నించారు. రైతులు బంగారాన్ని తాకట్టు పెట్టి బోర్లు వేస్తున్నారన్నారు. కరువు మండలాలుగా ప్రకటించడంలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే రేపు ఇన్సూరెన్సులు ఏ విధంగా ఇస్తారని నిలదీశారు. నాడు జగన్ ప్రభుత్వమే ఇన్సూరెన్సులకు ప్రీమియం చెల్లించిందన్నారు. ఈ ఏడాదికి రైతు భరోసా ఒక్క రూపాయి చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. అన్నమయ్య జిల్లాను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

వక్ఫ్ సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టం

వక్ఫ్ సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టం చేసిందన్నారు. వక్ఫ్ చట్టాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పార్లమెంటు సాక్షిగా వైఎస్సార్‌సీపీ ప్రకటించిందన్నారు. లోక్‌సభలో ఎంపీ మిథున్ రెడ్డి, ఇతర ఎంపీలు స్వయంగా ప్రకటించారన్నారు. రాష్ట్రంలో సెక్యులర్ పార్టీ అయిన వైఎస్సార్‌సీపీ నిజాయితీ, విలువలతో అందరి మనోభావాలను గౌరవిస్తూ నడుస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వ పాలన అస్తవ్యస్తం..

కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా విద్యారంగం, సంక్షేమ పథకాల అమలు, శాంతి భద్రతలు రాష్ట్రంలో దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. వడ్డెర కులానికి చెందిన తిరుపతి వారాధి దారుణంగా హత్యకు గురయ్యారన్నారు. పట్టణంలో గ్యాంగ్ వార్లు, అల్లర్లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్ టీచర్‌ను ఆ పాఠశాల విద్యార్థులే చంపితే దానిపై ఇప్పటి వరకు అతీగతి లేదన్నారు. రాయచోటిలో విచ్చలవిడిగా జరుగుతున్న డ్రగ్స్ వాడకాన్ని అరికట్టాలన్నారు. కూటమి పాలన వచ్చిన తరువాత అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అభివృద్ధి జాడ లేకుండా పోయిందన్నారు. మున్సిపాల్టీలలో పారిశుధ్యం లోపించిందన్నారు. దేశంలోనే ధనిక సీఎంగా పేరు పొందడం కాదు.. ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయాలని సీఎం చంద్రబాబునాయుడుకు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. తమ హయాంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మార్చామన్నారు. ఇప్పుడు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు కావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా గత ప్రభుత్వంపైన ఇంకా విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పుడు ఏ ఒక్క పథకం ఇవ్వకున్నా ఏడాది కాకమునుపే రూ.1.50 లక్షల కోట్లను ఈ ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. సమావేశంలో రాయచోటి మన్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నకిలీ ఫోన్‌పేతో జనరల్ స్టోర్‌లో రూ.3 లక్షల మోసం

ముగ్గురు యువకులపై కేసు నమోదు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నెరోడ్డులో గల నరసింహా సరకుల అంగడిలో నకిలీ ఫోన్ పేతో మోసం చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. చాపాడుకు చెందిన శివ, లక్ష్మీపేటకు చెందిన వీరాంజనేయరెడ్డి, సీతారామాపురానికి చెందిన సాయి అనే ముగ్గురు యువకులు గత మూడు నెలలుగా నరసింహా సరుకుల అంగడిలో నకిలీ ఫోన్‌పేతో మోసం చేస్తున్నారు. ముగ్గురు యువకులు రోజుల వ్యవధిలో తరచుగా జనరల్ స్టోర్ వద్దకు వెళ్లి రూ.2-10 వేల వరకూ సరకులను కొనుగోలు చేసి ఫోన్‌పేలో నగదు చెల్లించినట్లు నకిలీ ఫోన్‌పే చూపిస్తున్నారు. గత మూడు నెలలుగా రూ.3లక్షల వరకూ ఫోన్‌పేలో డబ్బులు వేసినట్లు నమ్మించారు. అనుమానం వచ్చిన దుకాణం నిర్వాహకుడు బుధవారం రోజూ వేసే నంబరుకు కాకుండా వేరే నంబరుకు ఫోన్‌పే నగదు పంపించాలని చెప్పడంతో మోసం బయటపడింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్రంకొండలో క్షుద్ర పూజల కలకలం





శ్మశానంలో క్షుద్రపూజలు నిర్వహించిన దృశ్యం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో క్షుద్ర పూజలు నిర్వహించిన విషయం కలకలం రేకెత్తించింది. స్థానిక ఇందిరమ్మకాలనీ శ్మశానంలో ఈ విషయం వెలుగుచూడడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అనుమానిత తాంత్రికులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి.

స్థానిక ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీల్లో సుమారు 900 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. రెండు కాలనీలకు మధ్యలో శ్మశాన వాటిక ఉంది. గుర్తు తెలియని తాంత్రికులు గత రెండు రోజులుగా శ్మశానంలో తాంత్రిక క్షుద్ర పూజలు నిర్వహించినట్లు కాలనీ వాసులు గుర్తించారు. కొంతమంది బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కాలనీలో అద్దె ఇళ్లలో కొంతకాలంగా నివాసముంటున్నారని కాలనీ వాసులు అంటున్నారు. వీరు అనుమానంగా తిరుగుతున్నారని, గ్రామానికి చెందిన కొంతమంది స్థానిక వ్యక్తుల సాయంతో వీరు తాంత్రిక క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. బుధవారం ఉదయం కాలనీవాసులు శ్మశానం వైపు వెళుతుండగా అక్కడ కొంతమంది తాంత్రికులు ఏవేవో పూజలు చేస్తున్నట్లు గుర్తించి కేకలు వేశారు. దీంతో వారు పరుగులు తీశారు. శ్మశానం వద్దకు వెళ్లి పరిశీలించగా పెద్ద ఎత్తున రంగు రంగుల ముగ్గులు, బొగ్గులు, నిమ్మకాయలు, నల్లదారాలు అక్కడ ఉంచిన దృశ్యాలు కనిపించాయి. దీంతో పాటు కోడి తలలు నల్లదారంలో ఉండలు ఉండలుగా చుట్టి ఉంచినట్లు వారు గుర్తించారు. దీంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని బయట ప్రాంతాల నుంచి అనుమానంగా ఉన్న కొంతమంది తాంత్రికులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో తాంత్రికులు కదిరి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

కన్నెర్రజేసిన మంత్రి...సెలవుపై వెళ్లిన ఎంపీడీఓ!

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబు ఏప్రిల్ 24వ తేదీ వరకు సెలవుపై వెళ్లారని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. అయితే ఉన్నట్లుండి ఎంపీడీఓ సెలవుపై వెళ్లడం వెనుక పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గత నెల 29 వ తేదీ శనివారం గాలివీడులో పర్యటించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని స్థానిక టీడీపీ నాయకులు కలిసి ఎంపీడీఓ జవహర్ బాబుపై ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీసీ కార్పొరేషన్ రుణాల జాబితా తయారీలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా దారి మళ్లించి చేతివాటం ప్రదర్శించారని, టీడీపీ నాయకులు ఇచ్చిన జాబితాను పక్కన బెట్టారని మంత్రి ఎదుట టీడీపీ నాయకులు వాపోయారు. దీంతో ఆగ్రహించిన మంత్రి వెంటనే ఎంపీడీఓకు ఫోన్ చేసి మండిపడ్డారు. లబ్ధిదారుల వద్ద నుండి ఎంత డబ్బులు తీసుకున్నావు. దీనిపై పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని చురకలంటించారు. దీంతో మంత్రి ఒత్తిడికి దిక్కుతోచని స్థితిలో ఎంపీడీఓ ఏప్రిల్ 24 వ తేదీ వరకు సెలవుపై వెళ్లినట్లుగా సమాచారం.

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. బలిజపల్లెలో గురువారం జరగనున్న జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. అందువల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు అధికారుల సూచనలు, సలహాల మేరకు నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది జరిగే గంగమ్మ జాతరలో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొంటారు. అయితే ఈ ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయినందున భక్తుల సంఖ్య గత ఏడాదికంటే గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతరలో గంగమ్మను దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, చెన్నై రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. దీంతో రాజంపేట పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజల ఇళ్లు బంధువులతో కళకళలాడుతున్నాయి. గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు పట్టణానికి పెద్దఎత్తున తరలి రావడంతో పట్టణంలో కోలాహల వాతావరణం నెలకొంది.

ఆకర్షిస్తున్న అమ్మవారి ప్రతిమలు

జాతరను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన గంగమ్మ ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే బలిజపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. గంగమ్మకు పుట్టినిల్లు అయిన తుమ్మల అగ్రహారంలోనూ విద్యుత్ దీపాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతరను బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి నిర్వహించనున్నందున ఆ మూడు గ్రామాల్లో ఎటుచూసినా సందడి వాతావరణం నెలకొంది. కాగా జాతరకు వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు దారిపొడవునా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.



భక్తుల కోసం బ్యారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

రాజంపేట టౌన్ : బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. జాతర సందర్భంగా బందోబస్తు విధులను నిర్వహించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులకు బుధవారం ఏఎస్పీ బలిజపల్లె గ్రామంలో దిశానిర్దేశం చేశారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, వారంతా అమ్మవారిని త్వరగా దర్శించుకోవాలన్న ఆత్రుతతో ఉంటారన్నారు. అందువల్ల పోలీసులు ఓర్పు, సహనంతో భక్తులకు వీలైనంత త్వరగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. క్యూలైన్లలో తోపులాటలు లేకుండా చూడాలన్నారు. వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో జాతరలోకి అనుమతించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అర్బన్, మన్నూరు అర్బన్ సీఐలు పి.రాజ, కుళాయప్ప, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, నవీన్‌బాబు, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో గంగమ్మ ప్రతిమ



మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట : మద్యం సేవించి భార్యతో గొడవపడిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బి.కొత్తకోటలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. స్థానిక రంగసముద్రం రోడ్డులో ఉంటున్న తమ్మిశెట్టి రత్నమయ్య (36) తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికొచ్చాక భార్య కావ్యతో గొడవ పడేవాడు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్య కావ్య బిడ్డలతో పడకగదిలోకి వెళ్లి నిద్రపోయింది. తెల్లవారుజాము రెండున్న గంటల సమయంలో ఇంటిలో శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా భర్త ఫ్యానుకు ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చింది. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ ఎస్టీ సెల్‌ను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు

మదనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ ఎస్సీ సెల్ ప్రత్యేక విభాగానికి డీఎస్పీల నియామకం చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2024వ సంవత్సరంలో గుట్టు చప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్ల డీఎస్పీల పోస్టింగులను రద్దు చేసిందన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, డీజీపీకి, ఈ విషయంపై లేఖ రాయించి సమస్య పరిష్కరించమని సూచించామన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనితను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే ఎస్సీ ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్‌లకు డీఎస్పీలకు పోస్టింగులు ఇచ్చి పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో బహుజన సేన రాష్ట్ర నాయకుడు గిన్నెల మనోహర్ రెడ్డి, నాయకులు కొమ్ము హరిబాబు, మూడే రూపా నాయక్, రాఘవేంద్ర యాదవ్, మేరీ తదితరులు పాల్గొన్నారు.

యూ ట్యూబర్లపై కేసు నమోదు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలానికి చెందిన యూ ట్యూబర్లు సత్యారెడ్డి, గూడూరు సుబ్రమణ్యం రాజు, శంకర్ రాజులపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వేకోడూరు ఫారెస్టు రేంజర్ శ్యామ్ సుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం విధులకు ఆటంకం కలిగిస్తూ, బ్లాక్ మెయిల్ చేయడం వంటి వ్యవహారాలు భరించలేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

ఆటో బోల్తా



టైరు పగలడంతో ప్రమాదానికి గురైన ఆటో

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపంలోని నాలుగు వరుసల జాతీయ రహదారిపై ఆటో టైరు పగలడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా.. మండలంలోని తిమ్మాపురం నుంచి తాడిపత్రి వైపు ప్రయాణిస్తున్న ఆటో దారి మధ్యలో కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపం వద్ద జాతీయ రహదారిపై టైర్ పగలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు గాయపడటంతో 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ధర్మవరానికి చెందిన పుల్లయ్యకు తలకు తీవ్ర గాయంతో పాటు కాలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

పశు వైద్యశాఖ అధికారులకు ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాలు అందుకుంటున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ఉగాది పురస్కారాలు అందుకున్నట్లు అన్నమయ్య జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. విజయవాడలోని సంచాలకుల పశుసంవర్ధకశాఖ రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు. పురస్కారాలు అందుకున్న వారిలో చిన్నమండెం పశువైద్య సహాయకులు డాక్టర్ డి. గణేష్, వీరబల్లె, మట్లి లైవ్ స్టాక్ ఆఫీసర్ సి. జయప్రకాష్, రాజంపేట కూచువారిపల్లె జూనియర్ అసిస్టెంట్ కౌసర్ బాను, అదే నియోజకవర్గం ఊటుకూరు పశుసంవర్ధక శాఖ సహాయకులు వెంకటసుబ్బయ్య, కలికిరి రైతు సేవా కేంద్రం, పశుసంవర్ధక సహాయకులు యం. వాసుదేవరెడ్డి, వీరబల్లె మండలం వంగిమళ్ల గోపాల మిత్ర యస్. రవికుమార్‌లు ఉన్నారు.

ఏనుగుల దాడి బాధితులకు నష్టపరిహారం పంపిణీ



చెక్కులు అందిస్తున్న అటవీశాఖ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని శేషాచలం అడవుల్లో నెలరోజుల క్రితం జరిగిన ఏనుగుల దాడిలో మృతి చెందిన ముగ్గురి కుటుంబీకులకు బుధవారం అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ సుబ్బరాజు, జిల్లా ఫారెస్టు అధికారి జగన్నాథ్ సింగ్ ఆదేశాల మేరకు రూ. 5 లక్షలు చొప్పున ఫారెస్టు రేంజర్ శ్యామ్ సుందర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వారికి రెండో దఫా రూ. 5 లక్షలు అందించామన్నారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు చొప్పున చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ జనార్దన్ పాల్గొన్నారు.

12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు



ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటిస్తూ, 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ షేక్ జాబీర్, సెక్రటరీ జనరల్ గఫార్‌ఖాన్‌లు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్నం ఉపాధ్యాయులు జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ కరోనా సందర్భంగా, సాధారణంగా చనిపోయిన స్థానిక సంస్థల ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులకు గత ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని కోరారు. 2004 సెప్టెంబర్ నోటిఫికేషన్‌తో నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలన్నారు. ఫ్యాప్టో కో- చైర్మన్‌లు ఆర్.రవిశంకర్, సిబాతుర్ రహిమాన్‌లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను కేంద్ర, రాష్ట్రాల పాలకులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 జూన్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కో- చైర్మన్‌లు శివారెడ్డి, రామక్రిష్ణ, ఫ్యాప్టో జిల్లా నేతలు హరిబాబు, మహమ్మద్ ఇలియాస్, మధుసూదన్, జాఫరుద్దీన్, సుధాకర్‌నాయుడు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ఎస్టీయూ, పీఈటీల సంఘం నాయకులు సుబ్రమణ్యంరాజు, నరసరాజు, పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బజారు వీధి స్థలాల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



వీధిస్థలాలు కబ్జాచేసి రేకుల షెడ్లు వేసుకొని ప్రజలకు నడకదారి లేకుండా చేసిన దృశ్యం

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని బజారు వీధికి వెళ్లే దారిలో దారిస్థలాలను కబ్జా చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బుధవారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండు నుంచి బజారు వీధికి వెళ్లేందుకు గతంలో విశాలమైన వీధి ఉండేదన్నారు. కొంతమంది వ్యాపారులు గతంలో చిన్నచిన్న బంకులు ఏర్పాటు చేసుకొని వీధి స్థలాలు కబ్జా చేశారన్నారు. ప్రస్తుతం బంకులను తొలగించి వాటి స్థానంలో పెద్ద ఎత్తున రేకుల షెడ్లు వేసుకొని వీధి స్థలాలు మొత్తం కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఇదే వీధిలో ఆటోలు, ద్విచక్రవాహనాలు తిరిగేవని, అలాంటి వీధిలో ప్రస్తుతం మనుషులు కూడా నడవడానికి వీలులేకుండా కబ్జాచేసి వ్యాపారాలు చేసుకొంటున్నారని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు పంచాయతీ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇకనైనా తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.